
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.9; కనిష్ఠం 19.9



నిజామాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 3 ఫిబ్రవరి 2024

## రూ.12వేలకు చేరిన పసుపు ధర

ఖిల్లా, ఫిబ్రవరి 2: వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం పసుపు రూ.12120 ధర పలికింది. పసుపు అమ్మకాల్లో గతేడాది కంటే రెండింతలు ధర పలుకుతోంది. పసుపు సాగు పడిపోయి దిగుబడులు తక్కువగా రావడంతో పాటు ఇతర ప్రాంతాల్లో పసుపునకు డిమాండ్ ఉండడం వల్ల ధర పెరిగింది. కొత్త పసుపుతో పాటు రైతులు గతేడాది నిలువ ఉంచుకున్న పాత పసుపునకు సైతం రూ.12వేల 525లు పలికింది. సరాసరి పసుపు ధర రూ.10వేల 300లు ఉండగా కొత్త పసుపునకు 12వేలు పలకడంతో రైతులు నాణ్యమైన పసుపునే తరలిస్తున్నారు.



# సాగు సందడి

- జిల్లాలో భారీగా పెరిగిన యాసంగి సాగు విస్తీర్ణం
- సన్నరకం వరి సాగువైపే రైతుల మొగ్గు
- జిల్లా వ్యాప్తంగా 3లక్షల 91వేల ఎకరాల్లో వరి సాగు

నిజామాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సన్నరకం బియ్యానికి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడంతో జిల్లాలో వరిసాగు భారీగా పెరిగింది. ఖరీఫ్‌లో పండించిన సన్నరకానికి భారీ డిమాండ్ రావడం, మద్దతు ధరకన్నా ఎక్కువగా ధర రావడంతో రైతులు ఎక్కువ మొత్తంలో సాగుకు మొగ్గుచూపారు. ఈ రబీలోనూ సన్నరకం వరిసాగును ఎక్కువ మంది రైతులు చేశారు. భూగర్భ జలాలు ఎక్కువగా ఉండడం, రెండు ప్రాజెక్టుల్లో నీళ్లు ఉండి ఆయకట్టుకు విడుదల చేయడంతో ఇతర పంటల కన్నా వరిసాగునే రైతులు ఎక్కువగా చేశారు. ఈ రబీలో వేసిన మొత్తం వరిసాగులో 62శాతం సన్నరకాలను సాగు చేశారు. డిమాండ్ ఎక్కువగా ఉండడం, జిల్లా రైస్‌మిల్లుల తో పాటు ఇతర రాష్ట్రాల రైస్‌మిల్లర్లు వచ్చి రైతుల వద్ద నేరుగా కొనుగోలు చేసి తీసుకువెళ్తుండడంతో యాసంగిలో ఇబ్బందులు ఉన్నా ఎక్కువ మంది సన్నరకాలను వేశారు.

### రెండేళ్లుగా సన్నాలకు డిమాండ్

సన్నరకం బియ్యానికి గడిచిన రెండేళ్లుగా డిమాండ్ పెరిగింది. రాష్ట్రంతో పాటు ఏపీ, తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా సన్నరకం బియ్యం వినియోగిస్తున్నారు. ఈ రాష్ట్రాలతో పాటు గల్ఫ్‌దేశాలకు కూడా సన్నరకం బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. ఈ రెండేళ్లలో సగటున సన్నరకం బియ్యానికి క్వింటాలుకు వెయ్యి రూపాయల వరకు ధర పెరిగింది. గతంలో కొత్తబియ్యం 5వేల లోపు క్వింటాలు దొరకగా, ప్రస్తుతం 6వేల వరకు రకాన్ని బట్టి ధర వస్తుంది. జిల్లాలో బీపీటీ, జైశ్రీరాం, ఎచ్‌ఎంటితో పాటు ఇతర సన్నరకాలను సాగుచేస్తున్నారు. జిల్లాలో వానాకాలం, యాసంగిలో ఈ సాగును పెంచుతున్నారు.

### నిండుగా భూగర్భ జలాలు

మూడేళ్లలో వర్షాలు ఎక్కువగా పడడం, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు నిండడం వల్ల భూగర్భ జలాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి రెండు సీజన్లకు నీటి విడుదల చేస్తుండడంతో సాగు ఎక్కువగా అవుతుంది. జిల్లాలో ఈరెండు ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు గుత్ప, అలీసాగర్, ఇతర చిన్న ఎత్తిపోతల పథకాలతో పాటు బోరు బావులకింద మొత్తం కలిపి 3లక్షల 91వేల ఎకరాల్లో ఈ యాసంగిలో వరిసాగును చేశారు. జిల్లాలో ఆరుతడి పంటలతో కలిపి 4లక్షల 82వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. జిల్లాలో సాగైన మొత్తం వరిసాగులో 62శాతం సుమారుగా 2లక్షల 35వేల ఎకరాల వరకు సన్నరకాలను రైతులు సాగుచేశారు.

### సన్నాలకు డిమాండ్

జిల్లాలో పండించిన సన్నరకం ధాన్యానికి గడిచిన కొన్నేళ్లుగా డిమాండ్ పెరిగింది. ఏపీలోని గుంటూరు, కర్నూల్ జిల్లాలకు చెందిన వ్యాపారులు ఏటా బోధన్ డివిజన్ పరిధిలో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వీరే కాకుండా కర్నాటకకు చెందిన బళ్లారి, రాయచూర్ రైస్ మిల్లర్లు కూడా ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని తీసుకు వెళ్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకంటే సన్నరకాలకు బయటనే ఎక్కువ వస్తుండడంతో జిల్లా రైతులు వ్యాపారులకే అమ్మకాలను చేస్తున్నారు.



# బీఆర్ఎస్ పథకాలు కొనసాగేనా?

“ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పథకాలపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గొర్రెల కొనుగోలు, దళితబంధు, బీసీబంధు పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గొర్రెల పంపిణీకి లబ్ధిదారుని వాటా కింద డీడీలు చెల్లించిన వారు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రెండో విడత కింద గొర్రెలు పంపిణీ చేయాలని కోరుతున్నారు. దళిత, బీసీబంధు కోసం దరఖాస్తు చేసిన వారు సైతం పథకం అమలుపై ఆరాతీస్తున్నారు. ”

- గొర్రెల పంపిణీ, దళితబంధు అమలుపై లబ్ధిదారుల అయోమయం
- పథకాలపై స్పష్టత లేకపోవడంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- నూతన ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- పథకాల అమలుపై ఆరాతీస్తున్న జిల్లాలోని దరఖాస్తుదారులు

నిజామాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ, దళితబంధు పథకాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో జిల్లాలోని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రెండు పథకాలకు అర్హులను ఎన్నికల ముందు ఎంపిక చేసినా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గొర్రెల పంపిణీకి ఎంపికైన వారు తమవాటా కింద డీడీలను అధికారులకు అందించి గొర్రెల యూనిట్‌ల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొదటి విడత గొర్రెల పంపిణీ చేసి రెండో విడత చేయకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని అధికారుల వద్ద వాపోతున్నారు. ఎన్నికల సమయంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో దళితబంధు కింద లబ్ధిదారులను ఎంపిక చేశారు. రెండు నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారుల డాటాను ఆన్‌లైన్ చేశారు. ప్రస్తుతం ఈ పథకంపై స్పష్టత లేకపోవడంతో ఎంపికైన వారు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు దళితబంధు మంజూరు చేయాలని కోరుతున్నారు.

### జిల్లాలో గొర్రెల పంపిణీ పథకం

జిల్లాలో గొర్రెల పెంపకం అభివృద్ధి పథకాన్ని 2015లో ప్రారంభించారు. మొదటి విడత కింద 10వేల 722 మంది అర్హులను ఎంపిక చేశారు. వీరికి గొర్రెల యూనిట్లను మంజూరు చేశారు. ఒక్కొక్క యూనిట్ కింద 20గొర్రెలు, ఒక పొట్టేలును కొనుగోలు చేసి అందజేశారు. ఈ యూనిట్లలో 75శాతం సబ్సిడీ ఇవ్వగా 25శాతం లబ్ధిదారుని వాట చెల్లించిన వారందరికీ గొర్రెలను పంపిణీ చేశారు. జిల్లాలో రెండో విడత కింద 8384మందిని ఎంపిక చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వీరికి పంపిణీ చేయాల్సి ఉన్నా వివిధ కారణాలబట్టి చేయలేదు. గత ఎన్నికల ముందు వీరిలో 929మందికి రెండో విడత కింద గొర్రెలను మంజూరు చేశారు. ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు పంపిణీ మొదలు పెట్టలేదు. లబ్ధిదారుల కింద ఎంపికైన 1071 మంది తమ వాటా కింద ఒక్కొక్కలు 43వేల 750 రూపాయలు డీడీ తీసి అధికారులకు ఇచ్చారు. ఎన్నికల ముందు నుంచి గొర్రెల యూనిట్ల కోసం వేచి చూస్తున్నారు. ఎన్నికల సమయంలో రెండో విడత కింద ఎంపికైన వారందరికీ పంపిణీ చేస్తామని తెలిపినా ఇప్పటి వరకు మాత్రం ఈ పథకంపై ఎలాంటి స్పష్టత రాలేదు. కొత్త ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. డీడీలు కట్టిన వారు నిత్యం పశుసంవర్ధక శాఖ అధికారుల చుట్టూ తిరిగివెళ్తున్నారు. గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో అధికారులు కూడా లబ్ధిదారులకు ఏమీ చెప్పలేని పరిస్థితి ఉంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల యూనిట్లపై సమీక్షిస్తే తప్ప స్పష్టత వచ్చే అవకాశం లేదు.

### ఎన్నికల ముందే రెండో విడత ఎంపిక పూర్తి

జిల్లాలో ఎన్నికలకు ముందు రెండో విడత కింద దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో 1100 మందికి అవకాశం ఇచ్చారు. ప్రాధాన్యం కింద నియోజకవర్గానికి 500మంది చొప్పున ఎంపిక చేశారు. కొంతమంది పేర్లను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేశారు. ఈ పథకం కింద మొదట 3లక్షల రూపాయలు అందిస్తామని తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు కూడా ఆన్‌లైన్ నమోదు చేయడంతో మెసేజ్ కూడా వారికి ఎంపికైనట్లు సమాచారం అందించింది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ తర్వాత చర్యలు చేపట్టలేదు. లబ్ధిదారుల జాబితా ఖరారు చేయడం వల్ల ఆయా నియోజకవర్గంలోని వారు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను కలవడంతో పాటు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దళితబంధు మంజూరు చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ఈ రెండు పథకాలకు ఎంపికైన లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం ఏమీ చెప్పలేని పరిస్థితి ఎదురుకావడంతో వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగానే పథకాల అమలు ఉండనుండడంతో అప్పటి వరకు లబ్ధిదారులను వేచిచూడాలని కోరుతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఈ పథకాలు కొనసాగే అవకాశం ఉంది.



● అధికారుల సమీక్షలో ఆర్‌పీలు(ఫైల్)

# వెట్టి చాకిరీ ఇంకెన్నాళ్లు?

- మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ఎనిమిది నెలలుగా అందని జీతాలు
- ప్రభుత్వం నుంచి వచ్చేది రూ.4 వేలు మాత్రమే
- మరో రూ.2 వేలు మహిళా సంఘాల నుంచి
- కామారెడ్డి జిల్లాలో 94 మంది ఆర్‌పీలు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకాలు తీసుకువచ్చినా మున్సిపాల్టీల్లోని ప్రజలకు అందించే ఆర్‌పీలు ఆర్థిక కష్టాలతో నానా అవస్థలు పడుతున్నారు. ఇంత చేస్తున్నా తమకు అందించే జీతం మాత్రం మూరెడు. పని మాత్రం బారెడు అని వాపోతున్నారు. పోని ప్రభుత్వం అందించే ఆ మూరెడు జీతాలైన నెలనెలకు అందిస్తున్నారా అంటే అదీ లేదని, ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదని ఆర్‌పీలు వాపోతున్నారు. ప్రభుత్వ పథకాలు, ఎన్నికల విధులు, మహిళా సంఘాలకు సంబంధించిన పనులన్నింటినీ ఆర్‌పీలే చేస్తున్నారు. అయినప్పటికీ వారికి నెలనెలా వేతనాలు అందని పరిస్థితి నెలకొనడంతో తమ కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆర్‌పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అరకొర వేతనాలు

ఆర్‌పీలకు నెలకు ప్రభుత్వం నుంచి అందే వేతనాలు రూ.4వేలు, మహిళా సమాఖ్య ద్వారా మరో రూ.2వేలు చెల్లిస్తుంటారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4వేలు ఎనిమిది నెలలుగా అందడం లేదు. గత ప్రభుత్వం రూ.4వేల జీతానికి బదులుగా రూ.6వేలను అందిస్తామని ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పథకం తీసుకు వచ్చినా పట్టణ ప్రజలకు చేరువచేసేందుకు తమతో పనులు చేయించడంలో చూపుతున్న శ్రద్ధ తమ జీతాలు చెల్లించడంలో మాత్రం చూపడంలేదని విమర్శలు ఆర్‌పీల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మాత్రం మారడం లేదని ఆర్‌పీలు పేర్కొంటున్నారు. చాలిచాలని వేతనాలతో పనిచేస్తున్న ఆ వేతనాలను సైతం నెలలతరబడి ఆపడంపై మండిపడుతున్నారు.

### ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఆర్‌పీలు

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటిల్లో మొత్తం 94 మంది పని చేస్తున్నారు. ఇందులో కామారెడ్డిలో 62, ఎల్లారెడ్డి 10, బాన్సువాడలో 22 మంది ఆర్‌పీలు ఆయా మున్సిపల్ వార్డుల పరిధిలో మహిళా సమాఖ్యలో తమ విధులను నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఎస్‌హెచ్‌జీ, ఎస్‌ఎల్‌ఎఫ్, టీవీ ఎఫ్‌లకు బుక్ కీపింగ్, మహిళలకు బ్యాంకు రుణాలు, శ్రీనిధి నుంచి రుణాలను ఇప్పించడం ఆరుణాలను సకాలంలో చెల్లించేలా చేయడం, వీధి వ్యాపారులను గుర్తించి వారి వ్యాపార అభివృద్ధికి రుణాలు మంజూరు చేయిస్తారు. అలాగే వీరిని ఆన్‌లైన్‌లో చేర్చి వెండర్స్ కార్డులను ఇప్పించడం, వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చూస్తారు. దీంతో పాటు ప్రభుత్వం చేపట్టే హారితహారం, పట్టణ ప్రగతి, తడి-పోడి చెత్తను వేరుచేయు విధానం, తడి చెత్తతో కంపోస్టు తయారుచేయూ విధానం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫోన్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసు కోవడం, మున్సిపాలిటీని ఓడీఎఫ్‌గా మార్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన, అనాథ పిల్లల సర్వే, బతుకమ్మ చీరల పంపిణీ, ఇంటింటి సర్వే తదితరాల్లో ఆర్‌పీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

### ఎనిమిది నెలలుగా జీతాలు లేవు..

: భారతి, ఆర్‌పీల కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే ప్రతి పథకాన్ని పట్టణ ప్రజలకు చేరువయ్యేలా చూడడంతో పాటు మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ వారికి ఆర్థికతోడ్పాటు అందేలా చూస్తున్నాం. అయినా తమకు కేవలం రూ.4వేల జీతం మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ జీతాలను సైతం ఎనిమిది నెలలుగా ప్రభుత్వం నుంచి విడుదల కావడం లేదు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం చేయడంలో, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విశ్వకర్మలకు ఆర్థిక లబ్ధిచేకుర్చేందుకు అందించే పథకం కోసం పని చేస్తున్నారు. ఇలా ప్రభుత్వాలు ఏ పథకాలు తీసుకువచ్చినా శాయశక్తుల అమలుకు ప్రయత్నం చేస్తూ వెట్టిచాకిరికి గురవుతున్నామని వాపోతున్నారు. అధికారులకు వినతులు ఇచ్చినా తమను పట్టించుకోడం లేదని ఆర్‌పీలు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వమైన స్పందించి తమకు జీతాలు పెంపుతో పాటు నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

# ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

- టికెట్ విషయంలో ప్రయాణికుడికి, కండక్టర్‌కు మధ్య వాగ్వాదం
- చెట్ల పొదల్లోకి క్యాష్‌బ్యాగు, టికెట్ల యంత్రం విసిరివేత
- ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్సులో కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి ఘటన మరవకముందే శుక్రవారం డిచ్‌పల్లిలో ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న నిజామాబాద్-1 డిపో (ఏపీ 25 జడ్ 0609) బస్సులో కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామానికి చెందిన దొంతుల రవి అనే వ్యక్తి ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో డిచ్‌పల్లి మండలంలోని గాంధీనగర్ వద్ద దిగాలని రవిని కండక్టర్ కోరాడు. బస్సు పాస్ డిచ్‌పల్లి స్టేషన్ వరకే ఉందని, గాంధీనగర్ వరకు టికెట్ తీసుకోవాలని కండక్టర్ రేయికుంట దేవిదాస్ సూచించాడు. దీంతో కోపోద్రిక్తుడైన ప్రయాణికుడు రవి.. కండక్టర్ దేవిదాస్‌పై దాడి చేశాడు. కండక్టర్ చేతులోని క్యాష్ బ్యాగ్, టికెట్లు ఇచ్చే యంత్రం బస్సులో నుంచి బయటికి విసిరేశాడు. బ్యాగులోని డబ్బులు బయట చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో డ్రైవర్ బస్సును నిలిపివేసి 100కు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికుడు దొంతుల రవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



ప్రయాణికుడు రవిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# జోరుగా ముందస్తు సర్వేలు




- త్వరలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్
- నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో జోరుగా సర్వేలు
- మండలాల్లో వివరాలు సేకరిస్తున్న సర్వే ఏజెన్సీలు
- రాష్ట్ర, కేంద్ర నిఘా ఏజెన్సీలు కూడా వివరాల సేకరణలో నిమగ్నం

నిజామాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ రానుండడంతో ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు నియోజకవర్గాల్లో జోరుగా ముందస్తు సర్వేలను నిర్వహిస్తున్నారు. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రజలనాడి తెలుసుకునే ప్రయత్నాలను చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమకు ఒప్పందం ఉన్న ఏజెన్సీల ద్వారా ఈ సర్వేలను కొనసాగిస్తున్నారు వీటితో పాటు రాష్ట్ర, కేంద్ర నిఘా ఏజెన్సీలు కూడా ఎన్నికలపై వివరాలను తీసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏఏ అంశాలు ఎజెండాగా మారనున్నాయో ఫీడ్‌బ్యాక్‌ను తమ ఏజెన్సీల ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల పరిధిలో ఈ సర్వేలను కొనసాగిస్తున్నారు.

### గెలుపే లక్ష్యంగా పార్టీల కసరత్తు

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు అన్ని పార్టీలకు ప్రాధాన్యతగా మారింది. కొత్తగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అదేఊపుతో ఎక్కువ సీట్లను సాధించేందుకు నజర్ పెట్టింది. శాసనసభ ఎన్నికలకు ముందు నిర్వహించిన విధంగానే తమ ఏజెన్సీల ద్వారా సర్వేలను కొనసాగిస్తుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండడంతో ఈ రెండింటిలో వివరాలను ఏజెన్సీల ద్వారా సేకరిస్తోంది. ఈ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు కూడా ఈ సర్వేలను కొనసాగిస్తున్నారు. తమ ఏజెన్సీల ద్వారా సర్వే చేపిస్తున్నారు. ఈ మూడు పార్టీలు ఈ సర్వే ఏజెన్సీలే కాకుండా రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోసియాలజీ హెడ్‌ల ఆధ్వర్యంలో ఇండిపెండెంట్ సర్వేలను చేపిస్తున్నారు. ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రజలు ఏవైపు ఉన్నారో వారి నాడీని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఏ సమస్యలు ఉన్నాయి, పార్లమెంట్ పరిధిలో ఏ అంశాలు కీలకంగా మారనున్నాయి, బీజేపీ ప్రకటించిన పసుపు బోర్డు ఎంతవరకు పనిచేయనుంది, రామజన్మభూమి అంశం ఎన్నికల్లో కీలకంగా మారనుందా, అయోధ్యలో రాముని విగ్రహ ఏర్పాటు అనంతరం మారిన పరిస్థితులు ఆ పార్టీకి మేలు చేస్తాయా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఇవేకాకుండా గల్ఫ్‌కు వెళ్లిన కుటుంబాల వారు ఏ పార్టీకి మొగ్గుచూపుతారో, కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు ఏ పార్టీకి ఓటు వేస్తారో, మహిళలు ఎవరివైపు మొగ్గుచూపుతారో రాష్ట్రంలో అధి కారంలోకి వచ్చిన కాంగ్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం పెట్టడం వల్ల మహిళలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతారా, మైనార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపే ఎక్కువగా మొగ్గుతారా, ఇతర పార్టీలకు ఎంతశాతం ఓటు వేస్తారు, రైతులు ఏవైపు ఉంటారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు ప్రభావం చూపుతాయా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఈ అంశాలే కాకుండా 18నుంచి 30ఏళ్ల వయస్సు ఉన్న యువత ఎలాంటి నిర్ణయం పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకుంటారు. వారు ఏవైపు మొగ్గుతారు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల కోసం విడుదల చేస్తున్న ప్రకటనల ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపైన ఉంటుందా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఆయా మండలాల పరిధిలో వర్గాల వారీగా ఈ వివరాలను సేకరిస్తున్నారు. వీరితోపాటు రాష్ట్రానికి చెందిన నిఘా ఏజెన్సీతో పాటు కేంద్రానికి చెందిన నిఘా ఏజెన్సీ వర్గాలు కూడా రాష్ట్ర వ్యాప్తంగా 17పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఈఫీడ్‌బ్యాక్‌ను తీసుకుంటున్నాయి. వారు ఈ రెండు పార్లమెంట్‌లలో చేపట్టిన సర్వే వివరాలను కూడా తమ ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

## 'లబ్ధిదారులకు దళితబంధు నిధులు ఇవ్వాలి'

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి2: జిల్లాలో రెండోవిడుత లబ్ధిదారులకు దళిత బంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం కామారెడ్డి జిల్లా దళితబంధు లబ్ధిదారులు సెక్రటరియట్ సిబ్బందికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎంచుకున్న యూనిట్స్‌పై అధికారులు విచారణచేశార ని ఖాతాలలో కొంతమేరకు నిధులను కూడా జమచేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో దళితబంధు నిధును లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని వెంటనే నిధులను విడుదల చేసి మా దళిత కుటుంబాలను ఆదుకోవాలని కోరమన్నారు.

### సర్పంచ్‌లకు సన్మానం

లింగంపేట, ఫిబ్రవరి2: మండలంలోని 41మంది సర్పంచ్‌లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లుగా గ్రామాల్లో మంచి సేవలు అందించి, గ్రామాభివృద్ధికి సహకరించిన సర్పంచ్‌లను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించి వారిసేవలను కొనియాడారు.

## 'బీజేపీ అధ్యక్షులను పట్టించుకోకుంటే ప్రతిఘటిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తాడ్వాయి, ఫిబ్రవరి 2: మండలాల బీజేపీ అధ్యక్షులను, కార్యదర్శులను పట్టించుకోకుంటే ప్రతిఘటిస్తామని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీజేపీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తున్నా తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో టికెట్లు తీసుకుని వచ్చి బీజేపీ అధ్యక్షులను, కార్యదర్శులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల ఎల్లారెడ్డి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వడ్డేపల్లిసుభాష్‌రెడ్డి బీజేపీ టికెట్ తెచ్చుకుని అధ్యక్షులను, కార్యదర్శులను పట్టించుకోవడం లేదని అన్నారు. గతంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనాయకులు,కార్యకర్తలకే వత్తాసు పలుకుతున్నాడని తెలిపారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పోటి చేయబోయే అభ్యర్థులు తమను పట్టించుకోకుంటే గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి లేకుండా కొందరు నాయకులు జహీరాబాద్ పార్లమెంటుకు పోటీ చేస్తామని సంకేతాలు తెలుపుతూ గ్రామాలలో ఫ్లెక్సీలు కడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులు తమను పట్టించుకోకుంటే కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

## 'ప్రశ్నించే ముందు అభివృద్ధిపై ఎంపీపీ ఆత్మ విమర్శ చేసుకోవాలి'

మాచారెడ్డి, ఫిబ్రవరి 2: తమను ప్రశ్నించేముందు ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు గత 25 ఏళ్లలో ఏం అభివృద్ధి చేశాడో ఆత్మవిమర్శ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరాంజనేయ వేంకటేశ్వరస్వామి ఆలయం స్థలం మాచారెడ్డి గ్రామస్థుడు ఇవ్వగా గత ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి అభివృద్ధికి కృషిచేశారని మాచారెడ్డి గ్రామ పెద్దమనుషుల శ్రమతో ఆలయ నిర్మాణం జరిగిందని అన్నారు. ప్రజాప్రతినిధి అయిన మీరు దేవాలయం యొక్క ఆస్తిని మీ పేరున ఇతరుల పేరున ఏ విధంగా నమోదు చేసుకున్నారో సమాధానం ఇవ్వాలని అన్నారు. కరెంటు మీటర్లు కూడా మీ పేర్లపైన ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌గౌడ్, పిట్ల శ్రీనివాస్, రమేష్‌,నర్సాగౌడ్, లింగం, రాజు, ఆశ్రఫ్, అర్షద్, సతీష్, బద్రి పాల్గొన్నారు.

### ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

గాంధారి, ఫిబ్రవరి2: గాంధారి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ జానకి గ్రామ సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల పట్ల అప్రమత్తంగా ఉండి పనులు సజావుగా ఉండేందుకు సిబ్బంది సహకరించాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తక్షణమే స్పందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

### ఎస్సైగా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ

గాంధారి, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో నూతన ఎస్సైగా ఆంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడ్వాయి మండలం నుంచి బదిలీపై గాంధారి పోలీసుస్టేషన్‌కు వచ్చారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### లావాదేవీలను సక్రమంగా నిర్వహించాలి

సదాశివనగర్, ఫిబ్రవరి2: మహిళా సమాఖ్య గ్రామ సంఘాలలోని ఆర్థిక లావాదేవిలను సీఏలు సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం రాజారెడ్డి తెలిపారు. సదాశివనగర్ఐకేపీలో సీఏల రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రతీ సంఘం యొక్క పోదుపులు అప్పులు ప్రతీ సభ్యుడి వివరాలను రిజిష్టర్‌లో పొందుపరిచి ఆర్థిక లావాదేవిలతో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. సంఘాల నిర్వహణ ప్రతినెల సమావేశం, పొందిన ఆర్థిక లావాదేవిలతో వ్యాపారాల పరివర్తన లాభనష్టాల వివరాలను సంఘాలలో చర్చించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు అబ్బులింగం, గౌరైరాములు, నరేందర్‌రెడ్డి, కృష్ణ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన జడ్పీటీసీ

లింగంపేట, ఫిబ్రవరి2: మండలంలోని ఒంటర్‌పల్లిలో శుక్రవారం జడ్పీటీసీ శ్రీలతసంతోష్‌రెడ్డి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామం లోని ప్రధాన రహదారి పూర్తిగా చెడిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో గ్రామంలోని రోడ్డును సీసీరోడ్డు వేయాలని జెడ్పీటీసీని ఆదేశించడంతో జెడ్పీ నిధులతో సీసీరోడ్డు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీస్ చైర్మన్ దేవెందర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, సతీష్‌గౌడ్, ఎంపీటీసీ దత్తాద్రీలతో పాటు నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

### మొక్కలను రక్షించే బాధ్యత ప్రతీఒక్కరిది

దోమకొండ, ఫిబ్రవరి2: ప్రతీఒక్కరు మొక్కలను రక్షించాలని ఎంపీడీవో, దోమకొండ గ్రామ ప్రత్యేకాధికారి చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం వాటరింగ్‌డే సందర్భంగా దోమకొండ జీపీలో మొక్కలకు నీరు పట్టారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామంలో చెత్తసేకరణ, వాటర్ సప్లయ్, తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎవరైన చెత్త బయట వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సౌజన్యకు ఆదేశించారు. సిబ్బంది ఇన్సురెన్సును చేసుకోవాలని సూచించారు.గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో తిరుపతిరెడ్డి, బిల్ కలెక్టర్ కిషన్, ఆపరేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డుకు మరమ్మతులపై హర్షం

మద్నూర్, ఫిబ్రవరి2: మండలకేంద్రంలో పాతబస్టాండ్ వద్ద అధ్వానంగా తయారైన రోడ్డుకు మరమ్మతులు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకిరావడంతో పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.


బోధన్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో పర్బన్న

## గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: బోధన్, సాలూర మండలాల్లోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని బోధన్ ఎంపీడీవో పర్బన్న అన్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం నుంచి అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది. ఈ సందర్భంగా అన్ని గ్రామాలకు సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో పర్బన్న తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నియమించిన అధికారులకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామాల్లో సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎంపీడీవో పర్బన్నతో పాటు తహసీల్దార్‌లు గంగాధర్, మల్లయ్యలతో పాటు అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు సర్పంచుల స్థానంలో ప్రత్యేక అధికారుల బాధ్యతలను స్వీకరించారు.

## స్వర్ణకార సంఘ అధ్యక్షుడిగా జనార్ధన్‌చారి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: బోధన్ స్వర్ణకార సంఘం అధ్యక్షులుగా శ్రీదోజ్ వార్ జనార్ధన్ చారి శుక్రవారం ఎన్నికయ్యారు. బోధన్ పట్టణంలోని విశ్వకర్మ భవనంలో శుక్రవారం స్వర్ణకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా జనార్ధన్ చారి, ప్రధాన కార్యదర్శిగా త్రివేణి నాగరాజు చారి, కోశాధికారిగా ఎం. నారాయణచారి, ఉపాధ్యక్షులుగా బి.హనుమాన్‌చారిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు తంగేళ్ళపల్లి శ్రీనివాసచారి తెలిపారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా మురహరి చారి, సుధాకర్‌చారి, సుంకోజు హరి కాంత్‌చారి, కె.బాలాజీ చారి, అశోక్ చారిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ కార సంఘం నాయకులు కాళిదాస్‌చారి, ప్రభాకర్‌చారి, రమణాచారి, భాస్కర చారి, రమేష్‌చారి, రాజశేఖర్ చారి, తదితరులు ఉన్నారు.



# డిస్ట్రిబ్యూటరీ కాలువపై పిచ్చిమొక్కలు

● డి19 కాలువలో చెత్తాచెదారం ● దిగువన రైతుల పంటల సాగుకు అందని నీరు ● పట్టించుకోని అధికారులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని కాకతీయ డిస్ట్రిబ్యూటరి 19 కాలువ చెత్తాచెదారం నిండిపోయింది. కాక కాలువలో చెత్తా చెదారంతో పాటు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. అంతేకాకుండా కాలువలో విరిగిపోయిన చెట్ల కొమ్మలు పడటంతో వాటికి నాచు తయ్యారయ్యి సాగునీటి ప్రవహానికి అడ్డంగా ఏర్పడింది. అలాగే చెత్తాచెదారంతో నీరు కలుషితమవు తోంది. ఈ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వార ఏర్గట్ల, తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాలకు సుమారు 2,500 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. అయితే కాలువకి అక్కడక్కడ గైడ్ వాల్స్ కూలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. అంతేకాకుండా కాలువలో చెత్తాచెదారం నిండి సాగుకు నీరు పూర్తిస్థాయిలో అందటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువను పరిశీలించి పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరు అందేలా చూడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


డి19 కాలువ కనిపించకుండా పెరిగిన పిచ్చిమొక్కలు


చెత్తాచెదారంతో నిండిపోయిన కాలువ

# ఘనంగా జాతీయ ఉపాధి హామీ దినోత్సవం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 2: జాతీయ గ్రామీణ ఉపాది హామి దినోత్సవ వేడుకలు మండలవ్యాప్తంగా ఉపాదిహామి కూలీలు, అధికారులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న చోట కేక్‌కట్‌చేసి పంపిణిచేశారు. జాతీయ గ్రామీణ ఉపాది హామి పథకం ప్రారంభమై నేటితో 18 సంవత్సరాలు పూర్తయి 19వ ఏట అడుగిడిన సందర్భంగా ఈ సంబురాలు జరుపుకున్నారు. కమ్మర్‌పల్లి గ్రామశివారులో మండల ఎంపీపీ లోలపు గౌతమి కేక్‌కట్ చేసి సబరాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు షఫి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు ఉపాది కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

● ఉపాధి హామీ కూలీలకు సన్మానం

**ఏర్గట్ల:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామాల్లో వంద రోజుల పనులు పూర్తి చేసిన ఉపాధి కూలీలను ఈజీఎస్ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున కూలీలను సన్మానించారు. ఇందులో ఎంపీవో శివచరణ్, ఈజీఎస్ వెంకట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు దొబ్బల రాజన్న, బడిగిరి అనిల్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో పనుల చోట కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ లోలపు గౌతమి


ఏర్గట్లలో ఉపాధిహామీ కూలీలను సన్మానిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

# పంచాయతీ పాలకవర్గాలకు ఘనంగా వీడ్కోలు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 2: రూరల్ మండలం గుండారం గ్రామ పాలకవర్గానికి ఘన సన్మానం నిర్వహించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డిలతోపాటు వార్డు సభ్యులను వీడీసీ పెద్దలు శాలువాతో సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాన్ని అభివృద్ధిపథంలో నిలిపామని సర్పంచ్ తెలిపారు. పార్టీలకు అతీతంగా ఉపసర్పంచ్ బీజేపీకి చెందిన వ్యక్తి అయినా తనకు సహకరించారని ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం వార్డు సభ్యులతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీలను కూడా సన్మానించారు. గుండారం గ్రామ ప్రత్యేక అధికారిగా రూరల్ తహశీల్దార్ అనిరుద్ బాధ్యతలు చేపట్టారు. ఇందులో సర్పంచ్ వారం లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, వీడీసీ పెద్దలు పోతన, దాసరి ఒడ్డెన్న, దాసరి శ్రీధర్, లింగారెడ్డి, అబ్దుల్, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

**మోస్రా:** మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతకుంట, గోవూర్, చే నెంబర్ తండా, తిమ్మాపూర్ గ్రామాలలో గ్రామ పంచాయతీ పాలకవర్గం 5సంవత్సరాల పదవీకాలం పూర్తి కావడంతో కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్, పాలకవర్గంను పూలమాలలు, శాలువతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సాయిలు, సర్పంచ్ సుమలత రాంరెడ్డి, ఉప సర్పంచ్ సుదర్శన్ గౌడ్, కార్యదర్శి ప్రేమ్ కుమార్, పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** ఐదేళ్ల పదవికాలం ముగియడంతో పదవీ విరమణ పొందిన మండల సర్పంచ్‌లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లోలం గౌతమి, మండల ఎంపీటీసీలు అధికారులు ఘనంగా సన్మానించారు. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారుల సహకారంతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, మండల ఎంపీటీసీలు, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, ఎంఈవో ఎస్.ఆంధ్రయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.


గుండారంలో పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం


కమ్మర్‌పల్లిలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

## 'టీయూలో సీట్లను భర్తీ చేయాలి'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: తెలంగాణ యూనివర్సిటీ పీజీ, ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో మిగిలిన సీట్లను గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్నత చదువులు అభ్యసించేందుకు కౌన్సిలింగ్ ద్వార మిగిలిన సీట్లను భర్తీ చేయాలని టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరికి శుక్రవారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు లక్ష్మణ్, రామ్‌జీ, కార్తిక్, వినోద్, సుధాకర్,లు కోరారు.

## ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు సమావేశం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని బీబీపూర్ తండా శివారులో గల ఆదర్శ పాఠశాల, కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోనే పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు తీసుకొచ్చి మోడల్ పాఠశాల డిచ్‌పల్లి పేరు ను ముందువరుసలో ఉంచాలని ఆయన కోరారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

## వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

కోటగిరి, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రతపై మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అవగాహన కల్పించారు. చేతులు నిరంతరం పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి స్థానికంగా చికిత్సలు అందజేశారు. అనంతరం కుష్టు వ్యాధి లక్షణాలు నివారణకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవితరాణి, సూపర్‌వైజర్ జ్యోతి, సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీయే గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెకు పోదాం అభియాన్ వర్క్ షాప్‌లో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీజేపీని మరింత బలోపేతం చేయాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, కన్వీనర్ స్వామి యాదవ్, మండల అధ్యక్షుడు మనోహర్, ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లచ్చప్ప, పోశెట్టి, బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: ఈనెల 3, 4, 5వ తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి వెట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్, సిద్ధు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సీతయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

## చేపూర్‌లో నర్సరీ పరిశీలన

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 2: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన లక్కం ప్రభాకర్ శుక్రవారం నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పువ్వుల మొక్కలను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. అదే విధంగా పల్లె ప్రకృతి నాన్ని సందర్శించి అత్యవసరంగా పరిష్కారించాల్సిన పనులను గుర్తించారు. మొక్కలను సంరక్షించానికి పైపులు కొనుగోలు చేయాలని కార్యదర్శులు సూచించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగానికి నీటి సదుపాయ కల్పించాలని సూచించారు.

## కొనసాగుతున్న నాయకుల నిరసన

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి2: పట్టణంలోని ముస్లిం మైనారిటీ నాయకులు మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్మన్‌ను నియామించాలని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం కొనసాగుతుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గి ఇప్పటి వరకు ఇన్‌చార్జి చైర్మన్‌ను నియమించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని ఎన్నికల అధికారి అవిశ్వాసం నెగ్గిన తీర్మాన కాపీని కలెక్టర్‌కు పంపగా ఆ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపారని నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని వారన్నారు. మైనారిటీకి చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నను ఇన్‌చార్జీ చైర్మన్‌గా నియామించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## బేకరిలో అధికారుల తనిఖీ

ఆర్మూర్ టౌన్ ఫిబ్రవరి 2: ఆర్మూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల డాల్ఫిన్ బేకరీలో శుక్రవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టార్ అశోక్‌సింగ్, సివిల్ సప్లయ్, అధికారులు వినోద్‌కుమార్, శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి మధుసూదన్ రెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడరాదని, బేకరీలో ఆహార పదార్థాల తయరీ అధ్వనంగా ఉండడం పట్ల దుకాణంలో పని చేస్తున్న వారిపై ఆయన ఈ సందర్భంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.


టీయూలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంట

## బీఈడీ పరీక్షా కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 1, 2, 3వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు ప్రారంభమయ్యాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. దీనిలో భాగంగా పరీక్షలకు 39మంది అభ్యర్థులకు గాను మొత్తం మంది పూర్తి స్థాయిలో హాజరయ్యారని, పరీక్ష కేంద్రంలో సౌకర్యాలపై పరీక్ష కేంద్రాన్ని సందర్శించినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఆపరేషన్ స్మైల్‌లో 65పిల్లల గుర్తింపు

● సీపీ కల్మేశ్వర్ శింగనేవార్

ఖిల్లా, ఫిబ్రవరి 2: పోలీసు శాఖలో అమలవుతున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు నిర్వహించగా కమిషనరేట్ పరిధిలో మొత్తం 65 మంది బాలలను గుర్తించినట్లు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ తెలిపారు. ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం 18ఏళ్ల లోపు తప్పిపోయిన, వదిలివేసిన కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లుయితే అలాంటి వారి సమాచారం సేకరించి వారితో పని చేయించిన యాజమానిపై కేసు నమోదు చేయడం కాని లేదా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి అప్పగించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు లేని వారిని చైల్డ్‌వెల్ఫేర్ కమిటి (సీడబ్ల్యుసి) వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలో గతనెల 65మంది పిల్లలను పట్టుకోవడం జరిగిందన్నారు. పిల్లలను పట్టుకుని వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే తప్పిపోయిన పిల్లల వివరాలను దర్పన్‌యాప్‌లో నమోదు చేసి వారి అడ్రస్‌లను గుర్తించడానికి ప్రయత్నించడం జరుగుతుందన్నారు.

## స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 2: 2023-24 విద్యా సంవత్సరంలో వివిధ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31వ తేది వరకు పొడగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శశికళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమిద్దాం : ఐఎఫ్‌టీయూ

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమించాలని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని తట్టికోటలో బీడీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మి కులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రం యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను మార్చిందన్నారు. బీడీ కార్మికులు కష్టపడి పీఎఫ్ ఖాతాల్లో జమ చేసుకున్న డబ్బులను షేర్ మార్కెట్‌లకు మార్చి కార్మికులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, బీడీ కార్మిక సంఘం నాయకురాలు రమ, లక్ష్మీ, గంగామణి, సావిత్రి, గోదావరి, విజయ, జమున, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.


దుకాణ సముదాయాలను తాళాలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

## పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి : కమిషనర్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 2: బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వ్యాపారస్తులు మున్సిపాలిటీ ఆస్తి పన్ను బకాయిలు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆస్తి పన్నులు చెల్లించని 11 దుకాణా సముదాయాల షెటర్లకు తాళాలు లేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయిదారులు తప్పకుండా మీ సేవా కేంద్రాల్లో, మున్సిపల్ సిబ్బందికి బకాయిలు చెల్లించి రసీదులు తీసుకోవాలన్నారు. లేనియెడల ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## నగరంలో బాలుడి కిడ్నాప్

● పోలీసుల అదుపులో దుండగుడు.. విచారణ

ఖిల్లా, ఫిబ్రవరి 2: నగరంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన మినాహజ్ అనే ఏడేళ్ల బాలుడిని అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు అపహరించి అమ్మివేసినట్లు తెలిసింది. ఈ ఘటన జనవరి 30న చోటు చేసుకోగ బాధితులు అదేరోజు ఒకటో టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి తండ్రి మహ్మద్ అయాజ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఆప్రాంతంలోని అన్ని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాలుడి కుటుం సభ్యులు ఉంటున్న భవనంలోనే సోహెల్ ఉంటున్నట్లు తెలిసింది. బాలుడిని కిడ్నాప్ చేసింది అదే కాలనీలో నివాసం ఉంటూ హోటల్ నడుపుతున్న సోహెల్ అనే వ్యక్తిని గుర్తించి అనుమానం తో ఆయన సెల్ నెంబర్ లోకేషన్‌ను, గుర్తించారు. సెల్ లోకేషన్ విజయవాడలో ఉన్నట్లు చూపించగా పోలీసులు అక్కడికి వెళ్లారు. అక్కడి నుంచి లోకేషన్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు హైదరాబాద్‌లోని ఓ లాడ్జ్‌లో తనికీ చేయగా సోహెల్ అక్కడ లభించాడు. సోహెల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. సోహెల్ మాత్రం పోలీసులకు పొంతన లేకుండా సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. కిడ్నాపర్‌ను పోలీసులు పట్టుకొచ్చినట్లు తెలుసుకున్న బాలుడి కుటుంబసభ్యులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని సోహెల్‌ను అప్పగిచాలని ఆందోళనకు దిగారు. పోలీసులు విచారణ చేసి వాస్తవాలను తెలుసుకునే పనిలో ఉండడంతో బాలుడి కుటుంబ సభ్యులను నచ్చచెప్పి బయటకు పంపారు. సోహెల్ గతంలో పిల్లలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మినట్లు తెలిసింది. సోహెల్ స్వయంగా తనకు తెలిసిన వారి పిల్లలను అమ్మడం వల్ల ఈ విషయం బయటకు పొక్కలేదని స్థానికులు తెలిపారు.


కిడ్నాప్‌కు గురైన బాలుడు



వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ నీతూకిరణ్

## అలీసాగర్ వాటర్ ఫిల్టర్‌బెడ్ పరిశీలన

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 2: నిజామాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే అలీసాగర్ వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను నగర మేయర్ దండు నీతూకిరణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, ఎక్కడా నీటి కలుషితానికి ఆస్కారం లేకుండా ప్రతీఇంటికి స్వచ్ఛమైన నీరు అందేలా సరఫరా చేయాలని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో డిప్యూటీ ఇంజనీర్ ఆనంద్‌సాగర్, అసిస్టెంట్ ఇంజనీర్ శంకర్, తదితరులున్నారు.

## 5న బీఆర్ఎస్ సమీక్షా సమావేశం

● హాజరుకానున్న కేటీఆర్, కవిత

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: ఈనెల 5న మండలకేంద్రంలోని గజవాడ కన్వెన్షన్‌లో జరిగే నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, హాజరుకానున్నరని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఇందల్వాయి టోల్ ప్లాజా నుంచి భారీ స్వాగత ర్యాలీ ఉంటుందని, ఈ సమావేశానికి రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువకులు పెద్దఎత్తున్న పాల్గొనాలని బాజిరెడ్డి కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 2: నగరంలోని దుబ్బా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ తెలిపారు. నగరంలోని ఆదర్శనగర్, గుర్బాబాది రోడ్, నాందేవ్‌వాడ, శివాజీచౌక్, దుబ్బా ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వేతనాల చెల్లింపులపై ఉద్యోగుల హర్షం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ ఉద్యోగులందరికీ మొదటి రెండు తేదీలలో వేతనాలు చెల్లించినందుకు ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ అలుక కిషన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినెల సకాలంలో వేతనాలు రాక ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడ్డారని, బ్యాంకులకు, ఎల్ఐసీ, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ఉద్యోగులు వడ్డీరేట్లు పెనాల్టీల భారం పడిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మాసం మొదటి వారంలోనే వేతనాలు వచ్చాయని, అలాగే రెండో మాసంలో ఒకటో తేదీనే వేతనాలు చెల్లించడం హర్షనీయమన్నారు. ప్రతీనెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించి ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



సారంగపూర్‌లో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

## పలు ఆలయాల్లో హుండీ లెక్కింపు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 2: నగర శివారులోని సారంగపూర్ హన్మాన్ ఆలయం, గాజుల్‌పేట్‌లోని బ్రహ్మపురిలోని బడారాంమందిర్‌లో శుక్రవారం హుండీలను లెక్కించారు. బడారాం మందిర్ ఆలయ హుండీలో రూ.11వేల 327లు, సారంగపూర్ హన్మాన్ ఆలయంలో రూ.66వేల 197లను లెక్కించారు. దేవదాయ పరిశీలకులు కమల, ఫిట్‌పర్సన్ వేణు, భక్తులు రాంచందర్, నరేష్, గంగారెడ్డి, సాగర్, అర్చకులు బ్రహ్మేశ్వర్, శ్రీనివాసచార్యులు, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అబివృద్ధికి కృషి

● ఒలింపిక్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ

మోపాల్ ఫిబ్రవరి 2: నగర సమీపంలోని బోర్గం(పి)గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి మూడవ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఆలయ అబివృద్ధికి అండగా ఉంటామని తెలిపారు. ప్రజలు అందరు ఆరోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరానని తెలిపారు. అనంతరం అయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈగ గంగాసాగర్, ఈగ గోపాల్‌రెడ్డి, ఈగ రమేష్‌రెడ్డి, ఈగ రవీందర్‌రెడ్డి, ఈగ గంగారెడ్డి, ఈగ పోతరెడ్డి, ఈగ గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

● మాక్లూర్‌లో కేక్ కట్ చేసిన జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ● జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం ● పాల్గొన్న గ్రామ పంచాయతీల సిబ్బంది



నడిపల్లిలో బాధ్యతలను స్వీకరించిన ఎంపీవో శ్రీనివాస్ గౌడ్



ఘన్‌పూర్ జీపీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో



కోటగిరిలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో



రుద్రూరులో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



హసాకొత్తూర్‌లో బాధ్యతలను స్వీకరిస్తున్న ఎంఈవో



బ్రాహ్మణ్‌పల్లిలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో బ్రహ్మానందం



దోంచందలో బాధ్యతలు స్వీకరించిన ఏవో

మాక్లూర్, ఫిబ్రవరి 2: సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం అధికారులను పంచాయతీ ప్రత్యేక అధికారులను నియమించడంతో వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారరు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాక్లూర్ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో క్రాంతి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, మండల కోఆప్షన్ సభ్యుడు షైమద్, మాజీసర్పంచ్ అశోక్‌రావు, శ్యామ్‌రావు, రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి:** గ్రామాల్లో సర్పంచుల పాలన ముగియడంతో శుక్రవారం అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించారు. డిచ్‌పల్లి ఎంపీడీవో గోపిబాబు (ఘన్‌పూర్), నడిపల్లి పంచాయతీ కి ఎంపీవో శ్రీనివాస్ గౌడ్‌లు బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామీణ ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో? లేదోనని? గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సిరికొండ:** సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం నియమించిన అధికారులు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీ కాలం గురువారంతో ముగియడం వల్ల ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చింది. మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు గాను మండల పరిషత్, రెవెన్యూ, నీటి పారుదల, పంచాయతీల శాఖల ఏఈలు, వ్యవసాయ అధికారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. వీరు శుక్రవారం ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు తీసుకున్నారు. సిరికొండలో ప్రత్యేక అధికారిగా నియమించిన ప్రవీణ్‌కుమార్ నర్సరీని, పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు.

**నిజామాబాద్ రూరల్:** సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఇక ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. రూరల్ మండలంలోని గ్రామాలకు ప్రత్యేక అధికారులు నియామకమయ్యారు. మండలంలోని 19 గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు నియమించారు. శుక్రవారం గుండారంలో ప్రత్యేక అధికారిగా రూరల్ తహసీల్దార్ అనిరుద్ బాధ్యతలు చేపట్టారు. తిర్మన్‌పల్లి, శ్రీనగర్ గ్రామాలకు ఎంపీడీవో మల్లేష్, కొత్తపేట్‌కు పీఆర్ ఏఈ నరేష్, మల్కాపూర్ (ఎ) గ్రామానికి ఎంపీవో మధురమ, తదితరులు ప్రత్యేక అధికారులుగా నియామకమయ్యారు.

**రుద్రూరు:** మండలంలోని పది గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. రుద్రూరు, సులేమాన్‌నగర్‌లకు ఎస్.వెంకటేశం (తహసీల్దార్), రాయకూర్ క్యాంప్, సిద్దాపూర్ (ఇ)లకు బాలగంగాధర్ (ఎంపీడీవో), చిక్కడ్‌పల్లి, రాయకూర్, రాణంపల్లిలకు పి.సాయిలు (ఎంపీవో), అక్బర్‌నగర్, అంబం (ఆర్), బొప్పాపూర్‌లకు డి.సంతోష్ (పశువైద్యాధికారి)లు ఆయా గ్రామ పంచాయితీల బాధ్యతలను తీసుకున్నారు.

**మోస్రా:** మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రత్యేక అధికారులు బాధ్యలు చేపట్టారు. మోస్రా మడల కేంద్రంలో ఉప తహసీల్దార్ సాయిలు ప్రత్యేక అధికారిగా బాధ్యలు చేపట్టారు. గోఫూర్, చే నెంబర్ తండాకు ఎంపీవో రఫీ, చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాలకు ఎంపీడీవో భారతి ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నరేందర్ రెడ్డి, విమల, లింగయ్య, భూమయ్య, సుమలత రాంరెడ్డి, కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, భూమేష్, కృష్ణ, మహేశ్వరి, ఉప సర్పంచ్‌లు సుదర్శన్ గౌడ్, స్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

**కోటగిరి:** కోటగిరి గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో మనోహర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని ఆయా గ్రామాలలో తహసీల్దార్‌లు, సూపరిండెంట్‌లు, వ్యవసాయ అధికారి, వార్డెన్‌తో పాటు పలువురు బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు నెరవేర్చనున్నారు. కాగా, ఉమ్మడి మండలంలో 28గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. అడ్కాస్‌పల్లి, బస్వాపూర్, దేవుని గుట్ట తండాలకు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఎత్తొండ, యాద్గార్‌పూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాలకు తహసీల్దార్ ప్రభాకర్, కోటగిరి, రాంపూర్ గ్రామాలకు ఎంపీడీవో మనోహర్ రెడ్డి, సుద్దులం, కొత్తపల్లి గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, లింగాపూర్, సుద్దులం తండా గ్రామాలకు ఏఎస్‌డబ్ల్యూవో సోమ శంకర్, పొతంగల్ మండలంలో పొతంగల్, కారేగాం, చేతన్ నగర్ గ్రామాలకు ఎంపీవో మారుతి, దోమలెడ్గి, వల్లభాపూర్ గ్రామాలకు అగ్రికల్చర్ అధికారి వహీద్ జమ, హంగర్గ, హంగర్గ ఫారం గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్, హెగ్డోలి, కల్లూర్, కొడిచర్ల గ్రామాలకు తహసీల్దార్ రమేష్, జల్లాపల్లి, జల్లాపల్లి ఫారం గ్రామాలకు ఎంఈవో నాగనాథ్, కొల్లూర్, సుంకిని గ్రామాలకు పశువైద్యాధికారి సురేష్, సోంపూర్, టాక్లీ లకు సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డిల నియమించారు.

**నవీపేట:** గ్రామ పంచాయతీ పాలకవర్గాల ఐదేళ్ల కాల పరిమితి ముగిసిపోవడంతో శుక్రవారం గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను కేటాయించగా.. ఇందులో ఒక్కొక్క అధికారికి రెండు నుంచి మూడు గ్రామాలను కేటాయించారు. ప్రత్యేక అధికారులు తమ కేటాయించిన గ్రామాలలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

**ఆర్మూర్ రూరల్:** సర్పంచుల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆలూర్, గగ్గుపల్లి గ్రామాల ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ నరేష్, అంకాపూర్, ఫత్తేపూర్ గ్రామాలకు ఎంపీడీవో శ్రీనివాస్, పిప్రి, మంథని గ్రామాలకు తహసీల్దార్ శ్రీకాంత్, అమ్దాపూర్, మగ్గిడి గ్రామాలకు డీటీ ప్రవీన్‌కుమార్, చేపూర్‌కు పశువైద్యాధికారి లక్కం ప్రభాకర్, దేగాంకు ఏవో హరికృష్ణ, గోవింద్‌పేట్‌కు డీటీ విజయ్‌కాంత్, ఇస్సాపల్లి, రాంపూర్ గ్రామాలకు సూపరిండెంట్ లక్ష్మీ, ఖానాపూర్, కోమన్‌పల్లి గ్రామాలకు ఎంఈవో రాజగంగారాం, మచ్చర్ల, మిర్దాపల్లి గ్రామాలకు ఏఈ నితిష్, సుర్బిర్యాల్‌కు పశువైద్యాధికారిణి అశ్వినిలను ప్రత్యేకాధికారులుగా నియమించింది.

**కమ్మర్‌పల్లి:** గ్రామ సర్పంచుల పదివీకాలం ముగియడంతో ఆయా గ్రామాలలో ప్రత్యే అధికారులను నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.. కలెక్టర్ ఆదేశాల మేరకు వారిస్థానంలో ప్రత్యేక అధికారులు వారివారికి కేటాయించిన గ్రామ పంచాయతీల్లో అధికారులు బాధ్యతలను స్వీకరించారు. కమ్మర్‌పల్లి, నాగాపూర్ జీపీలకు ఎంపీడీవోటీ సంతోష్ రెడ్డి, అమీర్‌నగర్, చౌట్‌పల్లి జీపీలకు తహసీల్దార్ ఆంజనేయులు, హసాకొత్తూర్‌కు ఎంఈవో ఆంధ్రయ్య, ఇనాయత్‌నగర్, కోనాసముందర్ గ్రామాలకు ఎంపీవో సదాశివ్ బషీరాబాద్‌కు సూపరింటిండెంట్ మైలరాం గంగాధర్, డీసీ తండా కు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆమేర్‌ఖాన్, కోనాపూర్‌కు ఏఈ ఇరిగేషన్ ప్రీతమ్ శేఖర్, కొత్తచెరువుతాండకు ఏఈ మిషన్ భగీరథ శ్రావన్‌కుమార్, నర్సాపూర్‌కు ఎంఎస్‌వో రమేష్, ఆర్‌ఆర్ నగర్‌కు ఏఈ పీఆర్‌జి శ్రీనివాసులు, ఉప్లూర్‌కు ప్రత్యేక అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌లను నియమించగా, శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

**జక్రాన్‌పల్లి:** సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియామిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీవో బ్రహ్మనందం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కాగా, మండలంలోని 21 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియామించినట్టు ఎంపీడీవో బ్రహ్మనందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్గుల్ గ్రామానికి వ్యవసాయాధికారిణి కె.దేవిక, బాలనగర్, చందమియాబాగ్ తండాలకు అనిల్‌కుమార్, జక్రాన్‌పల్లి, బ్రహ్మణ్‌పల్లిలకు ఎం.బ్రహ్మనందం, చింతలూర్, కొలిప్యాక్‌లకు డాక్టర్ శిరిష, గన్యతండాకు ఎన్.శ్రీవర్ష, కలిగోట్, మనోహరాబాద్‌లకు ఎంఏ.ఖలీం, కేశ్‌పల్లి, పడకల్‌లకు సిద్ధార్థరెడ్డి, మునిపల్లి, లక్ష్మాపూర్‌లకు యుసుఫ్‌ఖాన్, మాదాపూర్‌కు జి.సునంద, నల్లగుట్ట తండా, పుప్పాలపల్లిలకు వెంకటేష్, నారాయణపేట్, సికింద్రాపూర్‌లకు సురేంద్రవర్మ, తొర్లికొండకు శ్రీనివాస్, వివేక్‌నగర్‌తండాకు రాణి నియమించారు.

**మోర్తాడ్:** మండలంలోని పది గ్రామాల పంచాయతీ కార్యాలయాలకు స్పెషల్ అధికారుల నియామకం జరిగింది. మోర్తాడ్, గాండ్లపేట్ గ్రామాలకు ఎంపీడీవో పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, దొన్‌పాల్, శెట్‌పల్లి గ్రామాలకు తహసీల్దార్ నడిమెట్ల సత్యనారాయణ, దర్మోరా, శెట్‌పల్లి గ్రామాలకు మిషన్ భగీరథ ఏఈఈ గురుడు స్వరాజ్, దొన్కల్‌కు మండల ఏవో లావణ్య, పాలెంకు సూపరిండెంట్ చిటుమాల లింగన్న, తిమ్మాపూర్, ఒడ్యాట్ గ్రామాలకు ఎంపీవో మామిడిపల్లి శ్రీధర్‌లు నియామకం అయ్యారు.

**ఏర్గట్ల:** మండలంలోని ఎనిమిది గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఏర్గట్ల, నాగేంద్రనగర్, బట్టాపూర్‌లో ఎంపీవో శివచరణ్, దోంచంద, తొర్తిలో ఏవో అబ్దుల్ మాలిక్, గుమ్మిర్యాల్, తాళ్లరాంపూర్‌లో తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్, తడపాకల్‌లో ఏఈ విక్రమ్‌లు బాధ్యతలు చేపట్టారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

**ముప్కాల్:** శుక్రవారం ముప్కాల్ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ముప్కాల్ మండల కేంద్రానికి, వెంచిర్యాల్‌కు ఎంపీడీవో దామోదర్, కొత్తపల్లికి తహసీల్దార్ వనజరాణి, నాగంపేట్‌కు ఏవో రాజ్‌కుమార్, నల్లూర్, రెంజర్ల గ్రామాలకు ఎంపీవో భరత్‌చంద్ర, వేంపల్లికి డీటీ శ్రీకాంత్‌లను నియామించారు.

**బాల్కొండ:** బాల్కొండకు ఎంపీడీవో సంతోష్‌కుమార్, బస్సాపూర్‌కు ఆర్‌అండ్‌బీ ఏఈ వినిత్, బోదేపల్లికి ఏవో మహేంధర్‌రెడ్డి, చిట్టాపూర్‌కు సూపరింటెడెంట్ రమణ, ఇత్వార్‌పేట్‌కు ఏఈ షరీఫ్‌హసన్, జలాల్‌పూర్‌కు ఏఈ లింబాద్రి, కిసాన్‌నగర్‌కు తహసీల్దార్ శ్రీధర్, నాగాపూర్‌కు డీటీ వినోద్; వన్నెల్(బి)కి ఎంపీవో వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ గ్రామాలకు ఏఈ అనిల్‌లను నియమించారు.



జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన సుద్దపల్లి విద్యార్థులు

## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు నిశిత, వర్షిణి, జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల ఆర్మూర్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చారని ఈనెల 3నుంచి 7వరకు చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ చూపాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత, ఫిజికల్ డైరెక్టర్ లత, సాఫ్ట్‌బాల్ పీటీ మౌనిక, అకాడమీక్ కోచ్ వేముల మౌనిక, తదితరులు ఉన్నారు.

## మామిడిపల్లి వద్ద రైల్వే నిర్మాణ పనుల కారణంగా రోడ్డు మూసివేత

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి2: ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా వాహనాల రాకపోకలను 45 రోజుల పాటు మూసి ఉంచుతున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఆర్మూర్ వైపు నుంచి మామిడిపల్లి మీదుగా అర్గుల్ వైపు వెళ్లేవారు గోవింద్‌పేట్ మీదుగా వెళ్లాలని వారు ఈ సందర్భంగా సూచించారు. అంతేకాకుండా 45 రోజుల పాటు వాహన రాకపోకలను అనుమతించరాదని, రోడ్డు మూసి ఉంచుతారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

## కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం : ఐఎఫ్‌టీయూ

పెద్దబజార్, ఫిబ్రవరి 2: కార్పొరేట్ కంపెనీలకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని ఐఎఫ్‌టీయూ నాయకులు ముత్తన్న, సుధాకర్‌లు అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల శ్రామిక్ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను అవలంభిస్తున్నారు. గురువారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వానికి ఆదాయం పెరిగిన ప్రజల కోసం అయా రంగాలకు కెటాయింపులు తగ్గించిందని ఆరోపించారు. 16న భారత్ బంద్‌కు పిలుపినిచ్చామని తెలిపారు. సమావేశంలో కార్మిక నాయకులు మల్లేష్, కిషన్, మురళీ, విఠల్, కరణ్, తదితరులు పాల్గొన్నారు.

● బీడీ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో బీడీ కార్మికులు పాల్గొనాలని తెలంగాణా ప్రగతిశీల బీడీవర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం బీడీ యజమాన్యా సంఘ అధ్యక్షకార్యదర్శులకు సమ్మె నోటీసును అందజేశారు.

● 16న సార్వత్రిక సమ్మె : సీఐటీయూ

ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేయడం జరుగుతుందన్నారు. కాగా, శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్‌లను ఆమె ఆవిష్కరించారు.

## 'బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 2: మహిళా, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీవన నైపుణ్యాలు మానసిక ఆరోగ్యం, మార్గదర్శక శిక్షణ కార్యక్రమం డిచ్‌పల్లి ప్రాజెక్టు పరిధిలోని ఇందల్‌వాయి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంపై ఏఆర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రరేటరీ సైకాలజిస్ట్ కే.సునీత విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు జీవన నైపుణ్యాలపై మానసిక ఆరోగ్య పరిస్థితులపై వివిధ కార్యక్రమాల ద్వారా వివరించారు. వారు ఒత్తిడిని ఎలా అదుపు చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వర్ష, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ శోభ, హెచ్ఈడబ్ల్యు జిల్లా మిషన్ కోఆర్డీనేటర్ స్వప్న, జనరల్ స్పెషలిస్టు కవిత, పుష్ప, అంగన్‌వాడి టీచర్లతో పాటు కేజీబీవీ పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



## చికెన్ ధరలు

| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | రూ.140 | రూ.215 | రూ. 240 |
| వెన్‌కాబ్(కిలో) | రూ.145 | రూ.220 | రూ. 250 |

## బంగారం ధరలు

| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.64,600 | రూ.59,500 | రూ.760 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (12.20,6.50)
: ఫైటర్ (హిందీ 3డీ) ( 3.15,9.45)
స్క్రీన్-2 : ఫైటర్ (హిందీ 3డీ) ( 11.45)
: హనుమాన్ (తెలుగు) ( 3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 : అగ్లీ(ఇంగ్లీష్) (11.00,7.45)
: గేమ్‌ఆన్ (2.05)
: ధీర (5.05)
: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.50)
స్క్రీన్-4 : కిస్మత్ (10.10,7.15)
: బూట్‌కట్‌బాలరాజు (1.00)
: హ్యాపీఎండింగ్ (4.05)
: ధీర (10.05)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : ధీర (10.45,7.20)
: గేమ్‌ఆన్ (1.25)
: హ్యాపీఎండింగ్ (4.30)
: బూట్‌కట్‌బాలరాజు (10.20)
స్క్రీన్-3 : హనుమాన్ (1.30,4.30, 7.30,10.30)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్: గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కిస్మత్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్